కమిషనరేట్ పరిధిలో బదిలీలు

ఇందూరు సిటీ, న్యూస్‌టుడే : నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ సోమవారం జారీ చేశారు. మొత్తం 91 మంది బదిలీకాగా ఇందులో ఏఎస్సైలు ఆరుగురు, హెడ్‌కానిస్టేబుళ్లు 12, కానిస్టేబుళ్లు 73 మంది ఉన్నారు.

పంట సాయం.. రూ.86.38 లక్షలు

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల అతివృష్టితో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ తెలిపారు. 676 మంది బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.86.38 లక్షలు విడుదలైనట్లు వెల్లడించారు. ఈ మొత్తాన్ని సంబంధిత రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని చెప్పారు.

పూర్తిస్థాయిలో నీటిమట్టం

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 8590 క్యూసెక్కుల వరద చేరుతోంది. పూర్తి స్థాయిలో 1091 అడుగుల వరకు నీటిమట్టం ఉంది. కాకతీయ కాల్వ ద్వారా సోమవారం 5000 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈఈ కొత్త రవి తెలిపారు. లక్ష్మి కాల్వకు 150, సరస్వతి కాల్వకు 500, వరద కాల్వకు 2000, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని చేసిన్నట్లు తెలిపారు.

రైతులకు నష్టం కలిగించొద్దు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి సోమవారం పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షం కురిసే అవకాశం ఉందని.. ధాన్యం తడవకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాంలోకి తరలించాలని ఆదేశించారు. చేపల పంపిణీపై ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఈనాడు నిజామాబాద్
మంగళవారం అక్టోబరు 15, 2024




తాడ్వాయి మండల కేంద్రంలో దాదాపు వెయ్యి మంది వరకు యువత, ఇతరులు విద్య, ఉపాధి నిమిత్తం హైదరాబాద్, ఇతర పట్టణాలకు వెళ్తుంటారు. దసరాకు వచ్చి వారం పాటు సందడి చేశారు. సెలవులు ముగియడంతో వెనుదిరుగుతున్నారు. మళ్లీ వీరంతా సంక్రాంతికి వచ్చి తాడ్వాయి ప్రీమియర్ లీగ్ పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు. దాదాపు 200 మంది సభ్యులు జట్లుగా విడిపోయి పోటీ పడతారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎంద్రియాల్‌లో దాదాపు 500 మంది విద్యార్థులు, యువత వారంపాటు గ్రామంలో సందడి చేశారు. ఇప్పుడు మళ్లీ తమ రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యేందుకు తిరుగు ప్రయాణమవుతున్నారు. ఈ రెండు గ్రామాలే కాదు. ఉమ్మడి జిల్లాలో ప్రతి ఊరి నుంచి ప్రజలు మది నిండా దసరా మధుర జ్ఞాపకాలు దాచుకొని వెళ్తున్నారు.

మదినిండా మధుర జ్ఞాపకాలు

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

- ముగిసిన దసరా సెలవులు
- పట్టణాల బాట పట్టిన ఉమ్మడి జిల్లా వాసులు



ఉరుకుల పరుగుల జీవితం. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడితే.. ఉద్యోగులు విధుల్లో తీరిక లేకుండా అలసిపోయారు. బతుకుదెరువుకు వలస వెళ్లి హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో కాయకష్టం చేసుకుంటున్నారు. వీరందరికీ ఈ సారి బతుకమ్మ, దసరా కలిసొచ్చాయి. వారం ముందే సొంతూళ్లకు చేరారు. కుటుంబ సభ్యులతో అనుబంధాలు, ఆనందం పంచుకున్నారు. స్నేహితులతో సందడి చేశారు. మహిళలు బతుకమ్మ ఆడారు. యువకులు ఆటలు ఆడారు. పెద్దలు సరదాగా కబుర్లు చెప్పుకొన్నారు. విందు భోజనాలు చేశారు. అలయ్.. బలయ్ ఇచ్చుకున్నారు. వారం పాటు సరదాగా గడిపి మధుర జ్ఞాపకాలు మదినిండా నింపుకొని మళ్లీ తమ రోజువారీ దినచర్యలో భాగమయ్యేందుకు తిరుగు ప్రయాణమయ్యారు.

మార్గాలు కిటకిట..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లోనూ బతుకమ్మ, దసరా ఉత్సవాలు అంబరాన్నంటాయి. పండుగల వేళ సందడి చేసిన జిల్లావాసులు ఇక తమ విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం వలస బాట పట్టారు. ఉమ్మడి జిల్లా జనాభాలో 15-20 శాతం మంది వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. వారంతా పండుగకు స్వస్థలాలకు వచ్చారు. వివిధ సమయాల్లో రావడంతో రహదారులు, ప్రయాణ ప్రాంగణాల్లో రద్దీ అంతగా లేకుండె. తిరుగు ప్రయాణంలో అంతా ఒకేసారి వెళ్తుండటంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటకిలాడుతున్నాయి. వ్యక్తిగత రవాణా సాధనాలు పెరగడంతో టోల్‌గేట్ల వద్ద కార్లు బారులుదీరాయి. ఇందల్‌వాయి, భిక్కనూరు టోల్‌ప్లాజాల వద్ద రద్దీ ఎక్కువగా కనిపించింది. హైదరాబాద్‌లో ఇంటర్, ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులు చేసేవారు ఎక్కువ. ఉపాధి కోసమైతే వృత్తి నిపుణులు మొదలు, ఇతర చిరు ఉద్యోగాలు సైతం రాజధానిపైనే ఆధారపడుతుంటారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లే కుటుంబాలు సైతం ఎక్కువే.



నిజామాబాద్ ప్రయాణ ప్రాంగణంలో రద్దీ...

కనుల పండువగా దుర్గా శోభాయాత్ర



పూల రథంపై దేవిమాత



రథం లాగుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఈరవత్రి అనిల్, రత్నాకర్ తదితరులు

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ గుస్సాడీ నృత్యం, కేరళ వాయిద్యం, తెలంగాణ బోనాలు, ఒగ్గుడోలు, పోతరాజుల ప్రదర్శన, కర్రసాము, ఇందూరు చిందు యక్షగానం, మహారాష్ట్ర డోల్ పథక్ విన్యాసాలతో దేవిమాత ముగింపు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. జిల్లాకేంద్రం కోటగల్లీలో సోమవారం నగర పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర కొనసాగింది. ప్రత్యేకంగా అలంకరించిన పూలరథంపై ఆదిపరాశక్తిని నగర వీధుల్లో ఊరేగించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశ వేణు, నాయకులు నరాల రత్నాకర్ తదితరులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జెండా ఊపి శోభాయాత్ర ప్రారంభించారు.



కోటగల్లీ మార్కండేయ మందిరం చౌరస్తాలో భక్తుల సందడి

డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నేడు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ- 2024లో నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి కొత్త కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఎస్జీటీ, తత్సమాన కేటగిరీలతో పాటు పండిట్లు, పీఈటీలు, అన్ని సబ్జెక్టులకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఖాళీలు, సీనియారిటీ జాబితాలు వెబ్‌సైట్ www.deonizamabad.inలో అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్ హాలులోకి అభ్యర్థులను మాత్రమే అనుమతించనున్నట్లు, అన్ని నిజధ్రువపత్రాలు, నియామకపత్రంతో హాజరు కావాలని సూచించారు.

కొత్తవారు చేరగానే రిలీవ్ చేయాలి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో నియమితులైన ఉపాధ్యాయులు మంగళవారం నిర్వహించే కౌన్సెలింగ్‌లో ఎంచుకున్న పాఠశాలలో చేరగానే గతంలో బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు సోమవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. గతంలో బదిలీ అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులు లేక అక్కడే పనిచేస్తున్న వారికి తాజా నిర్ణయంతో ఉపశమనం లభించినట్లయింది.

మానవత్వం మరిచారు



★★★ నవీపేట మండలం కోస్లీకి చెందిన మ్యాతరి అబ్బయ్య, భార్య సంగీత(45)తో కలిసి సెప్టెంబరు 14న ద్విచక్రవాహనంపై వసతి గృహంలోని తమ పిల్లలను చూసేందుకు బయలుదేరారు. జిల్లా కేంద్రం అర్సపల్లిలో ఓ కల్యాణ మండపం వద్ద వెనకాల నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో సంగీత అక్కడికక్కడే మృతిచెందడంతో పిల్లలు తల్లిలేనివారయ్యారు.



★★★ ఎల్లమ్మగుట్టకు చెందిన గోవూరి లక్ష్మణ్(49)కు ముగ్గురు కుమార్తెలు. ఇద్దరి పెళ్లిళ్లు చేశారు. చిన్న కూతురి వివాహం నిశ్చయమైంది. ఏప్రిల్ 22న జాన్కంపేటలో బంధువులకు శుభ లేఖలు పంచి వస్తుండగా అర్సపల్లిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులకు విషయం ఆలస్యంగా తెలిసి ఓ ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. బిడ్డ పెళ్లి ఘనంగా చేద్దామని కలలు కన్న ఆయన మరణం కుటుంబాన్ని కుంగదీసింది. సరైన సమయంలో వైద్యం అంది ఉంటే పరిస్థితి మరోలా ఉండేది.



న్యూస్‌టుడే, ఇందూరు సిటీ

జిల్లా వ్యాప్తంగా 27 హిట్ అండ్ రన్ కేసులు

క్షతగాత్రులను వదిలేసి జారుకుంటున్న నిందితులు

ప్రాణం విలువైంది. రోడ్డు ప్రమాద ఘటనలో తక్షణం వైద్యం అందితే బతికే వీలుంది. కానీ, కొందరు ప్రమాదం చేసి తమను ఎవరూ చూడలేదని మెల్లగా జారుకుంటున్నారు. ఈ ఘటనల్లో క్షతగాత్రులు సమయానికి వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ వ్యక్తిపై ఆధారపడిన కుటుంబం గురించి ఒక్క క్షణం ఆలోచించినా చేసిన తప్పునకు ప్రాయశ్చిత్తం చెల్లించే వీలుంటుంది.

మానవత్వంతో వ్యవహరించాల్సిన చోట తప్పించుకునేందుకే మొగ్గుచూపుతున్నారు. ఒకరి నిర్లక్ష్యం మరొకరి జీవితాన్ని అంధకారం చేస్తోంది. అతివేగంగా వాహనాలు నడిపి నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు కారకులవడమే కాకుండా, చావు బతుకుల మధ్య ఉన్న క్షతగాత్రులను వదిలేసి పారిపోతున్నారు. ఇలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టమని ఇటీవల నిర్వహించిన సమీక్షలో పోలీసులు నిర్ణయించారు. ప్రమాదం చేసి తప్పించుకుంటున్నామని భ్రమపడటం తప్పు. కొంత ఆలస్యమైనా నిందితుడు తప్పనిసరిగా దొరుకుతాడు. వివేకంతో ఆలోచించి పోలీసులకు లొంగిపోయినా, బాధితులకు సాయం చేసినా కేసు తీవ్రత తగ్గే వీలుంటుంది. తప్పించుకోవాలని చూస్తే దాని పరిణామం తీవ్రంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై ఎప్పటికప్పుడు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మార్పు రావడంలేదు.

డివిజన్	నమోదైన కేసులు
నిజామాబాద్	17
ఆర్మూర్	7
బోధన్	3

ప్రత్యేక కమిటీ ఏర్పాటు

ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 27 హిట్ అండ్ రన్ (ఢీకొట్టి పారిపోయిన) కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే 17 కేసుల్లో ప్రమాదాలకు కారకులను పోలీసులు గుర్తించారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా జిల్లా పాలనాధికారి నేతృత్వంలో పర్యవేక్షణ కమిటీ పనిచేస్తోంది. పోలీసు, రవాణా, వైద్యారోగ్య, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ప్రమాదంలో మరణించిన మృతుడి కుటుంబానికి రూ.2 లక్షలు, గాయపడితే రూ.50 వేలు పరిహారంగా అందించాల్సి ఉంటుంది.

బాధ్యతగా వ్యవహరించాలి
- నారాయణ, నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ

ప్రమాదం జరిగితే భయపడి పారిపోకుండా బాధ్యతగా వారిని కాపాడే ప్రయత్నం చేయాలి. ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్)లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తే బతికే అవకాశాలు ఎక్కువ. తప్పెవరిదనే విషయం పక్కనబెట్టి మానవత్వంతో స్పందిస్తే ప్రమాద తీవ్రతను తగ్గించొచ్చు.

జిల్లాకు సమీకృత గురుకులం

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని ఇందులో భాగంగానే జిల్లాకు త్వరలోనే సమీకృత గురుకులం మంజూరు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గురుకుల నిర్మాణాలకు ఆర్మూర్, నిజామాబాద్ గ్రామీణం, బోధన్ నియోజకవర్గంలో అనువైన స్థలాలు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, తరువాత జిల్లా అభివృద్ధికి పార్టీలు కలిసి రావాలని పేర్కొన్నారు. తనతో పాటు ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిలు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంపై ముఖ్యమంత్రితో మాట్లాడినట్లు వివరించారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. మామిడిపల్లి, మాధవనగర్ ఆర్వోబీ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ఎంపీ అర్వింద్ ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చేలా కృషి చేయాలని సూచించారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోచారం, ఏనుగు రవీందర్ రెడ్డి మధ్య సయోధ్య కుదుర్చేందుకు కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడికి బాధ్యతలు అప్పగించామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, నగర అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, వినయ్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, రత్నాకర్, జావిద్, రాంభూపాల్, సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగరంలోని ఎల్లమ్మగుట్టలో రేణుకా గౌడ సంఘ భవనాన్ని ప్రారంభించారు.

21న నుడా ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నుడా (నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ) ఛైర్మన్‌గా నియమితులైన కేశ వేణు ఈ నెల 21న బాధ్యతలు చేపట్టనున్నారు. పాత మున్సిపల్ కార్యాలయంలో నుడా కార్యాలయం ఉంది. అక్కడ ప్రమాణ స్వీకారం చేసేందుకు కాంగ్రెస్ నగర కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు, జిల్లాకు చెందిన కార్పొరేషన్ల ఛైర్మన్లు హాజరుకానున్నారు.

మక్క.. లాభాలు ఎంచక్కా
పావు ఎకరం.. ₹ 10వేల ఆదాయం
రైతేరాజు వివరాలు 6లో...



బాధలు తీరేనా...

న్యూస్‌టుడే, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి గ్రామీణం

ఇటీవల డిచ్‌పల్లి మండల కేంద్రంలోని డిచ్‌పల్లి-ఘన్‌పూర్ రైల్వేగేటు మధ్యలో సాంకేతిక కారణంతో గూడ్స్ రైలు దాదాపు 30 నిమిషాలు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 2018 జూన్ 10న ఇందల్‌వాయి మండల కేంద్రంలోని గేటు వద్ద గూడ్స్ రైలు సాంకేతిక సమస్యతో రెండు గంటలు నిలిచిపోవడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.



గ్రామీణ నియోజకవర్గంలోని ఇందల్‌వాయి-ధర్పల్లి, సిర్నాపల్లి-గన్నారం, డిచ్‌పల్లి-ఘన్‌పూర్ మార్గాల్లో ఉన్న రైల్వే గేట్లతో వాహనదారులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గాల్లోని రైల్వే లైన్‌లో నిత్యం 70కి పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. రైలు వచ్చే ప్రతిసారి 10 నుంచి 15 నిమిషాల పాటు రోడ్డు రవాణా నిలిచిపోతోంది. దీంతో ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని కామారెడ్డి - బాసర రైల్వే మార్గంలో రైళ్ల రద్దీ ఉండగా.. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉండడంతో డబ్లింగ్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని రైల్వేగేట్లను ఎత్తివేసి వాటి స్థానాల్లో ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రైల్వే గేట్ల వద్ద అధికారుల స్థల పరిశీలన

ఇందులో భాగంగా ఈ నెల 1న రైల్వే, రెవెన్యూ, రోడ్లు భవనాలు, పోలీసు శాఖ అధికారులు గ్రామీణ నియోజకవర్గంలోని ఇందల్‌వాయితోపాటు సిర్నాపల్లి-గన్నారం, డిచ్‌పల్లి-ఘన్‌పూర్ గేట్ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణాల సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు పేర్కొన్నారు. మరోమారు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతారని పేర్కొన్నారు. దీంతో వంతెనలు మంజూరైతే ఏళ్ల నుంచి పడుతున్న ఇబ్బందులు దూరమవుతాయని ప్రయాణికులు భావిస్తున్నారు.

పనులు త్వరగా ప్రారంభిస్తే బాగుంటుంది

మాది తిర్మన్‌పల్లి.. ఏ చిన్న వస్తువు తీసుకురావడానికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. కానీ ఎక్కడ గేటు పడుతుందోనని భయంగా ఉంటుంది. గేటు పడితే దాదాపు 15 నిమిషాల సమయం వృథా అవుతుంది. కొన్ని సందర్భాల్లో 30 నిమిషాలు కూడా ఆగాల్సి వస్తోంది. ప్రస్తుతం అధికారులు సర్వే చేయడంతో వంతెన నిర్మిస్తారనే నమ్మకం కలిగింది. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలి. **- ప్రవీణ్‌కుమార్‌గౌడ్, తిర్మన్‌పల్లి**

జిల్లా హాకీ జట్టు ఖరారు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా సీనియర్ పురుషుల హాకీ ఎంపికలు సోమవారం ఆర్మూర్‌లో నిర్వహించారు. తెలంగాణ హాకీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెలలో హైదరాబాద్‌లో అంతర జిల్లాల హాకీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా జట్టును ఎంపిక చేశారు. 40 మంది క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనగా 18 మంది క్రీడాకారులు ప్రతిభ చాటి ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలోనే జరగనున్న టోర్నమెంట్‌లో పాల్గొంటారని జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. హాకీ సంఘం జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మహ్మద్ ఆరీఫ్, ఈసీ సభ్యుడు నాగేశ్, సీనియర్ హాకీ క్రీడాకారుడు పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు వీరే

ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీలు
బజ్జీలు ఇవ్వలేదని ఇంటికి నిప్పు ... 6లో

మక్క.. లాభాలు ఎంచక్కా

న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం

వానాకాలం సీజనులో మక్కలు (మొక్కజొన్నలు) ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌కు చెందిన రైతు మూడ అశోక్ ఇంట సిరులు కురిపించాయి. సాగులో సస్య రక్షణ చర్యలు చేపట్టి పెట్టుబడికి మూడు రెట్ల ఆదాయం ఆర్జించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు అశోక్.

మూడెకరాల్లో సాగు..

రైతు అశోక్ ఎకరం వ్యవసాయ భూమిలో పసుపు, వరి 6 ఎకరాలు, 3 ఎకరాల్లో మొక్కజొన్న, కూరగాయలు అర ఎకరంలో పండిస్తున్నారు. అందరికంటే ముందుగా మే మొదటి వారంలోనే జినామిక్స్ 305 రకానికి చెందిన మొక్కజొన్న విత్తనాలు 2 ఎకరాల్లో విత్తుకున్నారు. మే 15న మరో ఎకరంలో సాగు ప్రారంభించారు. దుక్కి దున్నడం, బోజలు వేయడం, కూలీల ఖర్చులకు రూ.5 వేలు ఖర్చుచేశారు. విత్తనాలకు రూ.2 వేలు, సేంద్రియ ఎరువులు, యూరియా, పురుగు మందులకు రూ.13 వేల పెట్టుబడి పెట్టారు. 3 ఎకరాలకు రూ.60 వేలు ఖర్చయింది. మొదట సాగు చేసిన పంట సెప్టెంబరు రెండో వారంలో, చివరిది సెప్టెంబరు 20న కోతకు వచ్చింది. మొత్తంగా 95 క్వింటాళ్ల 50 కిలోల దిగుబడి రాగా.. రూ.2,32,052 అందాయి. ఖర్చులు పోను రూ.1.72 లక్షల ఆదాయం వచ్చిందని రైతు వివరించారు. పసుపు, వరి, కూరగాయలతో మరింత ఆదాయం పొందుతున్నట్లు చెప్పారు.


మొక్కజొన్న క్షేత్రంలో రైతు అశోక్

శ్రమకు దక్కిన ఫలితం

- మూడ అశోక్, పెర్కిట్

కష్టాన్ని నమ్ముకొని సాగు చేసినందుకు ఇతర పంటలతో పోల్చుకుంటే ఈ ఏడాది మక్కకు మంచి ధర దక్కింది. అధిక దిగుబడి సాధించేందుకు మంచి రకానికి చెందిన విత్తనాలు ఎంచుకోవడం ముఖ్యం. మొక్కజొన్నలకు ప్రతి ఏడాది రైతులకు గిట్టుబాటు ధర ఉండేలా ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వాలి. మొక్కజొన్నలు పండించే ప్రాంతంలో దీని అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ధర నిలకడగా ఉండేలా చూడాలి.

రైతేరాజు

పసుపులో సస్యరక్షణ

న్యూస్‌టుడే, కోటగిరి : పసుపు పంటకు ఆశించే తెగుళ్లలో ప్రధానమైంది దుంప కుళ్లు, దుంప ఈగ. తెగులు వ్యాప్తి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తెగులు లక్షణాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రుద్రూర్ కేవీకే సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డా. విజయ్‌కుమార్ పలు సలహాలు, సూచనలు తెలిపారు.



● **దుంప కుళ్లు:** పంటలో అధికంగా నీరు నిల్వ ఉండటంతో దుంప కుళ్లిపోతుంది. తెగులు సోకిన పంట ఆకులు గోధుమ రంగులోకి మారుతాయి. మొక్కలను పీకినట్లైతే తేలికగా ఊడి వస్తాయి. నివారణకు మొదట పొలంలో నీరు నిల్వ ఉండకుండా కాల్వల ద్వారా బయటకు తీసేసే ఏర్పాటు చేసుకోవాలి. అనంతరం లీటరు నీటికి 2.5గ్రా మెటలాక్సిల్, మాంకోజెబ్ లేదా 3గ్రా కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను తెగులు సోకిన మొక్కల చుట్టూ మొదలు తడిచేలా పోయాలి. తెగులు ఉద్ధృతి ఎక్కువగా ఉన్నట్లైతే కిలో సైమాక్సిల్, మాంకోజెబ్ పొడి తగినంత యూరియా (10-20కిలోలు) కలుపుకొని పొలం అంతటా చల్లుకొని నివారించుకోవచ్చు.

● **దుంప ఈగ:** దుంప కుళ్లు ఆశించిన సమయంలో వెలువడినటువంటి చెడు వాసనకు దుంప ఈగ ఆశిస్తుంది. ఈగ ఆశించిన మొక్క సుడి ఆకు, దాని దగ్గరలో ఉన్న లేత ఆకులు గోధుమ రంగులోకి మారి ఎండిపోతాయి. మొవ్వు లాగితే సులభంగా ఊడి వస్తుంది. లక్షణాలు గమనించిన వెంటనే ఎకరాకు 200కిలోల వేప పిండి వేసుకోవాలి. లేదా 10కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకోవాలి.

రైతు ప్రశ్న సమాధానం

? పత్తి పంటలో రసం పీల్చు పురుగులైన తామర, పేనుబంక, పచ్చదోమ నివారణ చర్యలు తెలుపగలరు?

- రమేష్, రైతు, మద్నూర్



పత్తి పంటలో రసం పీల్చు పురుగులైన తామర, పేనుబంక, పచ్చదోమ నివారణకు ఎసిఫెట్ 1.5గ్రా లేదా ఎసిటామిప్రిడ్ 0.2గ్రా లేదా థయోమిథాక్సామ్ 0.2గ్రా లేదా ఫ్లోనికామిడ్ 0.3గ్రా లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా ఎసిఫెట్, ఇమిడాక్లోప్రిడ్ 2గ్రా లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

- డా.బాలాజీనాయక్, వరి, చెరకు పరిశోధన స్థానం అధిపతి, రుద్రూర్

– న్యూస్‌టుడే, కోటగిరి

పావు ఎకరం.. ₹ 10వేల ఆదాయం

● 40 ఏళ్లుగా కూరగాయల సాగు

న్యూస్‌టుడే, ఎడపల్లి

ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్‌కు చెందిన శశికాంత్ అనే రైతు 10గుంటల భూమిలో బెండకాయ సాగు చేస్తున్నారు. పెట్టుబడి కోసం రూ.3,600 ఖర్చు చేశారు. విత్తనాలు విత్తిన 40రోజుల తర్వాత దిగుబడి మొదలవుతుంది. ఇలా రెండు నెలలకు పైగానే ఉత్పత్తులు పొందొచ్చు. వారానికి రూ.2,500 చొప్పున ప్రతి నెల రూ.10వేల వరకు ఆదాయం పొందుతున్నారు. పండించిన ఉత్పత్తులను స్థానిక అంగళ్లకు తరలించి వ్యాపారులకు విక్రయిస్తుంటారు. గత 40 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నట్లు రైతు తెలిపారు.

వరితో పోలిస్తే మంచి లాభాలు

..శశికాంత్, మంగళ్‌పాడ్

వరితో పోలిస్తే కూరగాయల సాగుతో మంచి లాభాలు పొందొచ్చు. రుద్రూరు మండలంలోని ఓ రైతు నుంచి బెండకాయ విత్తనాలు కొనుగోలు చేశా. దీంతో లాభాలతో పాటు దిగుబడి కూడా బాగుంటుంది. ప్రకృతి అనుకూలిస్తే కూరగాయల ద్వారా ప్రతి వారం రూ.10 వేల ఆదాయం పొందే అవకాశం ఉంది. ఈ సాగుతో లాభాలే తప్ప నష్టాలు ఉండవు.




సాగవుతున్న బెండ తోట

జాతీయ రహదారి పొడవునా దొంగతనాలే...

న్యూస్‌టుడే, సదాశివనగర్

కామారెడ్డి జిల్లాలో 44వ నంబరు జాతీయ రహదారి భిక్కనూరు మండలం బస్వాపూర్ నుంచి సదాశివనగర్ మండలం దగ్గి వరకు విస్తరించి ఉంది. ఇది దొంగలకు రాచమార్గంగా మారింది. ఎవరికి అనుమానం రాకుండా తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను పరిశీలించి చోరీలకు పాల్పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ద్విచక్ర వాహనాలను సైతం ఎత్తుకెళ్తున్నారు. ఒంటరి మహిళలు, గోదాములు, తాళం వేసిన గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడి జాతీయ రహదారి గుండా తప్పించుకుంటున్నారు. ఈ మార్గంలో దగ్గి, కల్వరాల్, పద్మాజివాడిక్రాస్‌రోడ్డు, సదాశివనగర్, మర్కల్, కుప్రియాల్, టేక్రియాల్, జంగంపల్లి గ్రామాలు ఉన్నాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడ, హైదరాబాద్ వెళ్లేందుకు ప్రధాన రహదారి. రద్దీ విపరీతంగా ఉండడంతో కొత్త వారిని గుర్తించే అవకాశం ఉండదు. వ్యాపారులు, ప్రజాప్రతినిధుల నుంచి విరాళాలు సేకరించి ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. ఇదే దొంగలకు అనువుగా మారింది.

జరిగిన సంఘటనలు

● గత నెల జాతీయ రహదారి పక్కనున్న ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు పడి కంప్యూటర్లు, బ్యాటరీలను ఎత్తుకెళ్లారు.

● రెండ్రోజుల కిందట సదాశివనగర్‌లో ద్విచక్ర వాహనాన్ని దుండగులు తీసుకెళ్లారు.

● గతేడాది సదాశివనగర్‌లోని గ్యాస్ గోదాంలో దొంగలు పడి సిలిండర్లు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేశారు.

● గతంలో కుప్రియాల్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో పనిచేసే సిబ్బంది విధులు ముగించుకొని వెళ్తుండగా జాతీయరహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించారు.

● సదాశివనగర్ వైన్స్‌లో దొంగలు పడి డబ్బులు, మద్యం ఎత్తుకెళ్తుండగా సీసీ కెమెరాల్లో రికార్డు అయింది.

● పద్మాజివాడి క్రాస్‌రోడ్డులో ఓ ఇంట్లో కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగాలేకపోవడంతో తాళం వేసి వెళ్లారు. ఇది గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి భారీమొత్తంలో నగదును దోచుకున్నారు.


పద్మాజివాడి క్రాస్ రోడ్డు

ప్రత్యేక చర్యలు చేపడతాం

- సంతోష్‌కుమార్, సీఐ, సదాశివనగర్



దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. ప్రజలు, వ్యాపారులు వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. జాతీయ రహదారిపై పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం తిరుగుతున్నాయి. ప్రజలు ఊళ్లకు వెళ్లేటప్పుడు... తమ ప్రాంతంలో కొత్త వాళ్లు, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

కుక్కల సంచారం.. జంకుతున్న జనం



నవీపేట మండల కేంద్రంలో శునకాలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఇప్పటికే పలువురు కుక్కల దాడిలో గాయపడినా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' ఎంపీవో రామకృష్ణ వద్ద ప్రస్తావించగా.. శునకాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో చర్చించి వారి సలహా మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యూస్‌టుడే, నవీపేట

డిగ్రీ, పీజీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉస్మానియా వర్సిటీ పరిధిలోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూరవిద్య కేంద్రంలో 2024- 25లో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నవంబర్ 15వరకు గడువు పొడిగించినట్లు గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు oucde.netలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అధ్యయన కేంద్ర సమన్వయకర్త రాము (99126 70252)ను సంప్రదించాలని సూచించారు.

ఓటు నమోదుకు పిలుపు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఉపాధ్యాయులందరూ ఓటు నమోదు చేసుకోవాలని తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి అధ్యక్షతన జిల్లా కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జీవో నెం.317లో నష్టపోయిన ఉపాధ్యాయులను సొంతజిల్లాలకు పంపించాలని, బకాయి బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్, రాష్ట్ర బాధ్యులు వరప్రసాద్, కీర్తి సుదర్శన్, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి

కనికరిస్తేనే.. కదులుతా !



చిన్నపిల్లాడిలా అంబాడుతూ ఇబ్బంది పడుతున్న ఈ దివ్యాంగుడి పేరు సజ్జద్. కోటగిరి మండలం ఎత్తొండ గ్రామం. చిన్నతనంలోనే పోలియో రావడంతో కాళ్లు పడిపోయాయి. తనకు ప్రభుత్వం దివ్యాంగుల శాఖ ద్వారా అందించే బ్యాటరీ ట్రైసైకిల్ ఇప్పించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అధికారులకు అర్జీ సమర్పించారు. – ఈనాడు – నిజామాబాద్

జాతీయస్థాయికి ఎంపిక



నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తమిళనాడులో నిర్వహించే ఖేలో ఇండియా సౌత్‌జోన్ నేషనల్ టోర్నమెంటుకు కేజీబీవీ(బాల్కొండ) విద్యార్థిని ఏలేటీ మైథిలి ఎంపికైనట్లు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఖోఖో సంఘం ఛైర్మన్ అనిల్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమారెడ్డి, అతీకుల్లా సోమవారం ప్రకటనలో తెలిపారు. నల్గొండలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని ప్రతిభచాటారని చెప్పారు. ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించే పోటీల్లో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించనుందన్నారు.

17న ఖోఖో పోటీలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా జూనియర్ బాలబాలికలు, సీనియర్ మహిళ, పురుషుల విభాగాల్లో ఈ నెల 17న ఖోఖో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమారెడ్డి, ఎండీ అతీఖుల్లా సోమవారం ప్రకటనలో తెలిపారు. నందిపేట్ మండల కేంద్రంలోని గీతా కాన్వెంట్ పాఠశాలలో నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు ఒరిజినల్ బోనోఫైడ్, ఆధార్‌కార్డులు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, సంఘం ఐడీ కార్డు తీసుకురావాలని చెప్పారు. ఈ నెల 16న సాయంత్రం 5 గంటల వరకు క్రీడాకారులు తమ వివరాలను నిజామాబాద్ జిల్లా ఖోఖో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి నాగేశ్వర్‌రావు చరవాణి నంబర్లు(85559 96271), (73965 41233)లకు తెలపాలన్నారు.

ఐటీఐల్లో కొత్త కోర్సులు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని మూడు ఐటీఐల్లో నూతనంగా ప్రవేశ పెట్టిన కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ యాదగిరి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐతో పాటు కమ్మర్‌పల్లి, బోధన్ మైనారిటీ ఐటీఐ కళాశాలల్లో నూతన కోర్సులు ప్రవేశపెట్టారని చెప్పారు. అర్హత, ప్రవేశం, కోర్సుల వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించి, అన్ని ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసి, 19న ఉదయం 11 గంటల్లోపు తక్షణ ప్రవేశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీలు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

☛ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ

పేదల ఇళ్ల నిర్మాణ పథకానికి ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలో కసరత్తు జరుగుతోంది. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి శనివారం సాయంత్రం వరకు కమిటీలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాని శనివారం దసరా పండుగ, మరుసటి రోజు ఆదివారం రావడంతో ప్రక్రియలో ఆలస్యం జరిగింది. మంగళవారం సాయంత్రంలోగా కమిటీలను పూర్తిచేయాలనే సంకల్పంతో అధికారులు పనిచేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో 526 గ్రామపంచాయతీలకు, 80 మున్సిపల్ వార్డులకు కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే నిజామాబాద్ జిల్లాలో 530 గ్రామపంచాయతీలకు, 60 కార్పొరేషన్, 85 మున్సిపాలిటీ వార్డులకు ఇందిరమ్మ కమిటీలు వేయనున్నారు. పేదలకు ఇందిరమ్మ గృహాలు నిర్మించాలనే లక్ష్యంతో ఈ కమిటీలు పనిచేయనున్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి సర్కార్ రూ.5 లక్షలు మంజూరు చేయనుంది.

ఉండేది వీరే..

గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఏర్పాటు చేయనున్న కమిటీల్లో ఏడుగురికి స్థానం కల్పించారు. గ్రామపంచాయతీల్లో సర్పంచి/ప్రత్యేకాధికారి ఛైర్మన్‌గా ఉంటారు. పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా కొనసాగుతారు. అదే గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలకు సభ్యులుగా అవకాశం కల్పిస్తారు. వేరే కాకుండా ముగ్గురు స్థానికులకు సభ్యులుగా తీసుకుంటారు. ఇందులో బీసీ వర్గాల నుంచి ఒకరికి, దళిత, గిరిజన వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పిస్తారు. అలాగే కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అయితే వార్డుస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. కార్పొరేటర్/కౌన్సిలర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. వార్డు అధికారి కన్వీనర్‌గా కొనసాగుతాడు. ఇక్కడ కూడా స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు. ఇక స్థానికుల కోటాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పిస్తున్నారు.

అధికార పార్టీ నుంచే ప్రతిపాదనలు..?

ప్రభుత్వం వెల్లడించిన ఉత్తర్వుల్లో కమిటీల ఏర్పాటు ఎవరు చేయాలనేది స్పష్టంగా లేకపోవడంతో చాలా చోట్ల అధికార పార్టీ ప్రతినిధులే సభ్యుల పేర్లకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిసింది. కొన్ని చోట్ల పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్తలనే కమిటీల్లో చోటు కల్పించడానికి ప్రయత్నం జరుగుతోంది. చాలా గ్రామాల్లో ఇప్పటికే కమిటీ సభ్యుల పేర్లను పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనూ అధికారపార్టీకి చెందిన నేతలే ఇందిరమ్మ కమిటీ సభ్యుల పేర్లను ప్రతిపాదిస్తున్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని పశువులకు ఈ నెల 15 నుంచి నవంబరు 14 వరకు ఉచితంగా టీకాలు ఇవ్వనున్నట్లు జిల్లా పశువైద్యాధికారి డా.జగన్నాథచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ ఆవులు, గేదెలు, లేగలు, దూడలను సమీప పశు వైద్యశాలలకు తీసుకెళ్లాలని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం ఐదో విడత కింద 2.52 లక్షల జీవాలకు టీకాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


మనోజ

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చంద్రాయన్‌పల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్‌కుమార్ కథనం ప్రకారం.. డిచ్‌పల్లి గ్రామానికి చెందిన వేముల సాయిలు పదేళ్లుగా తల్లిదండ్రులతో కలిసి చంద్రాయన్‌పల్లిలో నివాసముంటున్నారు. ఎనిమిదేళ్ల కిందట కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం దగ్గి గ్రామానికి చెందిన మనోజ(29)తో వివాహం కాగా, వీరికి ఇద్దరు కుమారులున్నారు. మనోజను భర్త సాయిలు అదనపు కట్నం కోసం వేధించేవాడు. తట్టుకోలేక ఆమె చంద్రాయన్‌పల్లి శివారులో చెట్టుకు ఉరేసుకుంది. మృతురాలి సోదరుడు మూడెడ్ల సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బజ్జీలు ఇవ్వలేదని ఇంటికి నిప్పు

● ముగ్గురు నిందితుల రిమాండు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం మూడో ఠాణా పరిధిలో ఓ ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో ముగ్గురు నిందితులను రిమాండ్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఆకాశ్, మనీశ్, ప్రమోద్ బస్టాండ్ వద్ద ఉన్న ఓ టిఫిన్ సెంటర్‌లో శనివారం అల్పాహారం చేయడానికి వెళ్లారు. ఆకాశ్ తింటుండగా మరిన్ని బజ్జీలు కావాలని హోటల్ యజమాని సచిన్‌ను కోరాడు. డబ్బులు ఇస్తే బజ్జీలు ఇస్తాననడంతో యూపీఐ ద్వారా చెల్లించాడు. ఇంతలోపే వేరే వ్యక్తికి ఇవ్వడంతో అయిపోయాయి. 'నేను డబ్బులు చెల్లించాను.. నాకు బజ్జీలు కావాలని' ఆకాశ్ పట్టుబట్టడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారు. దీనిపై యజమాని ఫిర్యాదుతో ఒకటో ఠాణాలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆగ్రహించిన ముగ్గురు యువకులు ఆకాశ్, ప్రమోద్, మనీష్‌లు కలిసి అదే రోజు అంబేడ్కర్ కాలనీలోని సచిన్ ఇంటిపై పెట్రోల్ బాటిల్ వేసి నిప్పంటించారు. సచిన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఎస్‌హెచ్‌వో మహేశ్ ముగ్గురు నిందితులను సోమవారం కోర్టు ఎదుట హాజరు పరిచి రిమాండుకు తరలించారు.

నాలుగు ఇళ్లలో చోరీ

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. నాలుగిళ్లలో చోరీకి పాల్పడ్డారు. రాంనగర్‌లోని జడ్పీ బాలుర పాఠశాల సమీపంలో ఉపాధ్యాయుడు రవికుమార్, రఘునాథ్, మాధవి ఇళ్లతో పాటు మామిడిపల్లి కేవీఆర్ కాలనీలోని ఓ ఇంటిలో చోరీ చేశారు. మాధవి గత శనివారం ఇంటికి తాళం వేసి నిజామాబాద్‌లోని తల్లిగారింటికి వెళ్లింది. సోమవారం ఉదయం దొంగలు ఇంటి తాళం పగులగొట్టి రెండు తులాల బంగారు నగలు, రూ.50 వేల నగదు అపహరించారు. పక్కనే రఘునాథ్ ఇంటికి తాళం వేసి ఉండటంతో పగులగొట్టి రూ.2 లక్షల నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. రవికుమార్, మామిడిపల్లిలోని ఓ ఇంట్లో ఏమీ లభించకపోవడంతో విఫలయత్నం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా కేంద్రం నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పరిశీలిస్తున్న ఎస్సై గంగాధర్

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

ఆలయ ప్రాంగణంలో గది నిర్మాణం



నిర్మించిన గది వద్ద దాత, ఆలయ అధికారులు

ఎడపల్లి : జానకంపేట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు దంపతులు రూ. 2లక్షలతో ఓ గది నిర్మించారు. దానిని సోమవారం అధికారులకు అప్పగించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేణు, పరిశీలకురాలు కమల ఉన్నారు.

ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు సన్మానం

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: కొండూరు గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను సోమవారం ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. గ్రామ మాజీ సర్పంచి అశోక్‌కుమార్, భూపాల్ రావ్, మాణిక్‌రావ్, గోవర్ధన్, గంగన్న, హన్మాండ్లు, అనిల్ తదితరులు ఉన్నారు.



ఈనాడు సినిమాలు

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)

స్క్రీన్-1: విశ్వం: 10.30, 4.10, 10.35 (రాత్రి)
జనక అయితే గనక : 1.30 దేవర పార్ట్-I : 7.25
స్క్రీన్-2: జిగ్ర (హిందీ) 10.30, 1.30, 10.20(రాత్రి)
మా నాన్న సూపర్ హీరో: 4.35 జనక అయితే గనక : 7.30
స్క్రీన్-3: వెట్టయాన్
10.20, 1.35, 4.30, 7.30, 10.40(రాత్రి)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1: విశ్వం : 9.20 వెట్టయాన్ : 12.35
దేవర పార్ట్-I : 4.05
జనక అయితే గనక : 7.40, 10.00(రాత్రి)
స్క్రీన్-2: జనక అయితే గనక : 10.10, 4.10
మా నాన్న సూపర్ హీరో : 1.10
విశ్వం : 7.15 10.30(రాత్రి)
స్క్రీన్-3: విక్కీ వైద్య కా వో వాలా (హిందీ) : 10.05 మార్టిన్ : 1.25
మా నాన్న సూపర్ హీరో : 8.00
వెట్టయాన్ : 4.30, 10.50(రాత్రి)
స్క్రీన్-4: జిగ్ర (తెలుగు) : 9.25 విశ్వం : 12.55
జిగ్ర (హిందీ) : 4.15 మార్టిన్ : 7.35,
విక్కీ వైద్య కా వో వాలా (హిందీ) 10.40 (రాత్రి)

దేవి (ఎస్వీసీ) : మార్టిన్
11.15, 2.15, 6.15, 9.15రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): విశ్వం
11.00, 2.20, 6.00, 9.20(రాత్రి)
లలితామహల్(ఎస్వీసీ): దేవర పార్ట్-I
10.45, 2.15, 6.00, 9.30(రాత్రి)
విజయ్(ఎస్వీసీ): వెట్టయాన్
11.00, 2.15, 6.00, 9.15(రాత్రి)

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

క్రీడా మైదానంపై దృష్టి ఏదీ?



ఇదీ పరిస్థితి..

2014కు ముందు నియోజకవర్గానికి ఒక మైదానం ఏర్పాటు చేయాలనే యోచనతో బోధన్‌కు రూ.2.10కోట్లు కేటాయించారు. వీటితో శక్కర్‌నగర్ కాలనీలోని స్థలాన్ని ఎంపిక చేశారు. శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టి రెండు భవనాలు నిర్మించారు. రాష్ట్ర ఆవిర్భావం, సర్కారు మారడంతో ప్రాధాన్యాలు మారిపోయాయి. ఇతర వసతుల కల్పన నిలిచిపోయింది. అలా క్రీడా మైదానం అందుబాటులోకి రాలేదు. దీంతో అప్పటికే నిర్మించిన భవనాల్లో ఉన్న ఫ్యాన్లు, ఇతర సామగ్రి దుండగులు అపహరించారు. ఆకతాయిలకూ అడ్డాగా మారింది.

2028 లేదా 2032 ఒలింపిక్స్‌లో తెలంగాణ ఒక పతకం సాధించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగా క్రీడా వర్సిటీ, నైపుణ్యాల మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సర్కారు చెబుతోంది. క్రీడాకారుల సాధనకు క్షేత్రస్థాయిలో మైదానాలు అవసరం. అలాంటి మైదానం బోధన్‌లో సిద్ధం చేయడానికి అన్నీ ఉన్నా.. యంత్రాంగం ఉదాసీనత అసంపూర్తి భవనాల్లో కనిపిస్తోంది. సర్కారు ఆశయ సాధనలో భాగంగా క్రీడాకారులను సిద్ధం చేసేందుకు అసంపూర్తి క్రీడా మైదానాన్ని మెరుగుపర్చాల్సిన అవసరముంది.

న్యూస్‌టుడే, బోధన్

ప్రస్తుతం మైదానంలో అరకొర వసతులతో అప్పుడప్పుడు యువకులు, పిల్లలు ఆటలు ఆడుతుంటారు. ఉదయం, సాయంత్రం నడకకు ఉపయుక్తంగా ఉంది.

ఇలా చేస్తే..

అదనంగా నిధులు సమకూర్చి ఉన్న భవనాల్లో భద్రతతో కూడిన, మైదానంలో సాధనకు అవసరమైన వసతులు కల్పించాలి. అవుట్‌డోర్ కోసం అవసరమైన పనులు చేపట్టాలి. అవి పూర్తయితే మైదానంలో ఆయా క్రీడలకు సంబంధించిన కమిటీలు నియమించి సాధన చేయిస్తే మైదానానికి రక్షణ ఉంటుంది. నైపుణ్యమున్న క్రీడాకారులు తమ ప్రతిభ మెరుగుపరచుకోవడానికి వేదికగా మారుతుంది.

స్టేడియం.. నిరుపయోగం

న్యూస్‌టుడే, జక్రాన్‌పల్లి



గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం



విరిగిన ప్రధాన ద్వారం

జక్రాన్‌పల్లి మండలంలో క్రీడాకారులకు కొదవలేదు. వాలీబాల్, కబడ్డీ టెన్నికాయిట్ వంటి క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారున్నారు.. కానీ క్రీడలకు ప్రోత్సాహం కరవైంది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం నిరుపయోగంగా మారింది. శిక్షకులు లేక, రూ.కోట్ల విలువైన స్టేడియం అధ్వానంగా మారింది.

ఆకతాయిల అడ్డాగా..

గత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో జక్రాన్‌పల్లిలో సైతం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రూ.2.10కోట్లతో స్టేడియం నిర్మించారు. కానీ క్రీడాకారులకు కావాల్సిన వసతులు, కోచ్‌లను నియమించలేదు. ప్రహరీ లేకపోవడంతో స్టేడియం ఆకతాయిలకు అడ్డాగా మారింది. జూదం, మద్యం, ఇతర మత్తు పదార్థాలు తీసుకునేవారు అక్కడికి చేరి తలుపులు, కిటికీలు అద్దాలు, ఇతర ఫ్లోర్ వంటివి ధ్వంసం చేశారు. విలువైన పరికరాలు దొంగల పాలయ్యాయి. ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అధికారులు స్పందించి స్టేడియానికి మరమ్మతులు చేయించాలని.. శిక్షకులను నియమించి అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం

స్టేడియానికి ప్రస్తుతం ఒక వాచ్‌మెన్‌ను కేటాయించాం. మరమ్మతులు, చుట్టూ ప్రహరీ నిర్మాణానికి సంబంధించిన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. నిధులు రాగానే పనులు చేపడతాం.

- ముత్తెన్న, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

ప్రజావాణికి 51 అర్జీలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, ఇన్‌ఛార్జి డీపీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ ప్రజల నుంచి 51 అర్జీలు స్వీకరించారు.

సొంత జిల్లాకు రప్పించాలని వినతి

గత ప్రభుత్వం తమను ర్యాండమైజేషన్ పద్ధతితో పలు శాఖలకు బదలాయించి ఇతర జిల్లాలకు పంపించిందని, తిరిగి సొంత జిల్లాకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని పూర్వ వీఆర్ఏ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పాలనాధికారి రాజీవ్ గాంధీ హన్మంతుకు వినతిపత్రం ఇచ్చారు. నూతన ఆర్వోఆర్ చట్టంలో భాగంగా వేరే జిల్లాలో పని చేసే వారిని జిల్లాకు తీసుకొచ్చి సర్దుబాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దయాసాగర్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న పూర్వ వీఆర్ఏ ప్రతినిధులు

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: న్యాల్‌కల్ రోడ్డు వివేకానంద నగర్ కాలనీలో చెత్త సేకరణ సరిగా చేపట్టడం లేదు. **- సూర్యప్రకాష్, స్థానికుడు**

సమాధానం : రిక్షా పంపుతాం **- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు**

మరమ్మతులు చేశారు





సమస్య: దర్గా ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై పైపులైన్ లీకేజీ ఏర్పడి నీరు రోడ్డుపై పారుతోంది. **- హరీష్, గ్రామస్థుడు**

పరిష్కారం: సిబ్బందితో మరమ్మతులు చేయించి లీకేజీని అరికట్టాం.

- ఉమా, పంచాయతీ కార్యదర్శి

సమస్య: గౌతంనగర్ జన్మభూమి రోడ్డులో ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. **- శేఖర్, గౌతంనగర్**

పరిష్కారం: రెండు మూడు రోజుల్లో పిచ్చిమొక్కలు తొలగించే ఏర్పాట్లు చేస్తాం.

-ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

సమస్య: మారుతీనగర్, కేసీఆర్ కాలనీ ప్రధాన రోడ్లపై వీధి దీపాలు లేవు.

-విజయానంద్, కేసీఆర్ కాలనీ

పరిష్కారం: విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం. పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **-పావని, ఏఈ కంఠేశ్వర్**

-న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ గ్రామీణం, నిజామాబాద్ వైద్య విభాగం

కలెక్టర్‌కు దసరా శుభాకాంక్షలు

నిజామాబాద్ కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం పలువురు ప్రముఖులు పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతుకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

కలిగోట్‌లో బతుకమ్మ సంబురాలు

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి మండలం కలిగోట్‌లో సోమవారం రాత్రి బతుకమ్మ సంబురాలు సందడిగా నిర్వహించారు. దసరా పర్వదినం తర్వాత గ్రామంలో బతుకమ్మ పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ప్రతి ఇంటి నుంచి బతుకమ్మలతో తరలివచ్చి ఆడిపాడారు. వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. చక్కగా తయారు చేసిన బతుకమ్మలకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ సర్పంచి చేతనరెడ్డి, అర్గుల్ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అనిత తదితరులు పాల్గొన్నారు. ఎస్సై తిరుపతి బందోబస్తు పర్యవేక్షించారు.



దుర్గమ్మ ఆకృతిలో బతుకమ్మ



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఓటు హక్కు వినియోగించుకోవాలి

నిజామాబాద్ గ్రామీణం, మోపాల్, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు ఓటు హక్కును వినియోగించుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి సూచించారు. కాంగ్రెస్ గ్రామీణ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఓటు ప్రాధాన్యం, అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న విద్యావ్యవస్థను పూర్తిగా మారుస్తూ.. త్వరలో మండలానికి ఒక సమీకృత గురుకులం నిర్మిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరితో ధనవంతులకే లబ్ధి చేకూరుతోందని.. పేదలు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యాలయంలో ఓటు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాసాగర్, శేఖర్‌గౌడ్, విక్కీయాదవ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు. మోపాల్ మండలం బాడ్సీ వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. గ్రామ నడిబొడ్డున ఉన్న పల్లెప్రకృతి వనాన్ని వేరేచోటుకి తరలించాలని కోరారు. సాయిలు, దశరథ్, జగదీష్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

టీపీసీసీ అధ్యక్షుడికి సత్కారం

సిరికొండ : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో కలిశారు. ఆయనను సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అసిఫ్, జీవన్‌నాయక్, సంతోష్, రామ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

నిజామాబాద్ విద్యావిభాగం : టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సోమవారం దసరా శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు, విద్యార్థులు, నాయకులు భారీగా తరలివచ్చారు. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థులు ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. కళాశాల మాజీ అధ్యక్షుడు సాయికుమార్, డీసీఈబీ కార్యదర్శి సీతయ్య, రమేష్, సాయిలు, నగేష్, రాజు తదితరులు ఉన్నారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌తో పూర్వవిద్యార్థులు

డంపింగ్‌యార్డు పరిశీలన



నిజామాబాద్ నగరం : నాగారం శివారులోని డంపింగ్‌యార్డును నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు సోమవారం పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేసి కంపోస్టు తయారు చేయడంపై ఆరా తీశారు. త్వరలో సీడీఎంఏ అధికారులు పర్యటించనున్న నేపథ్యంలో కమిషనర్ ముందస్తుగా తనిఖీ చేపట్టారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రుద్రూర్, న్యూస్‌టుడే : రాయకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ ఛైర్మన్ సురేష్‌బాబా సోమవారం ప్రారంభించారు. సన్న రకానికి రూ.2,300, దొడ్డు రకానికి రూ.2,320 ధర నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాబాయి, నాయకులు సంగమేశ్వరరావు, అరుణ్, సంజీవరెడ్డి, సత్తయ్య, నారోజి గంగారాం, హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

రుద్రూర్ : సికింద్రాబాద్‌లో హిందూ దేవతల విగ్రహాలు ధ్వంసం చేసిన నిందితులను శిక్షించాలని భాజపా జిల్లా బీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌గౌడ్, శ్యామ్, నవీన్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు రుద్రూర్ చౌరస్తాలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ జయేష్‌రెడ్డి, ఎస్సై సాయన్నలు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.

పునఃప్రారంభం కాని ప్రైవేటు కళాశాలలు

నిజామాబాద్ విద్యావిభాగం : దసరాలోపు తమకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధికంగా బంద్ పాటిస్తామని యాజమాన్యాలు ఇదివరకే అధికారులకు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రైవేటు కళాశాలలు పునఃప్రారంభం కాలేదు. ప్రభుత్వ కళాశాలలు మాత్రం యథావిధిగా తిరిగి ప్రారంభమయ్యాయి.

బోధన్ : పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు సోమవారం నుంచి నిరవధిక బంద్ పాటిస్తున్నాయి. ఈ మేరకు యాజమాన్యాల ప్రతినిధులు తమ కళాశాలల ఎదుట నిరసన చేపట్టారు. బోధనా రుసుముల బకాయిలు విడుదల చేయాలనే డిమాండుతో ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ స్పందన కొరవడటంతోనే నిరసనకు దిగినట్లు వెల్లడించారు. తెవివి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సమన్వయకర్త శ్రీనివాసరాజు (మిమ్స్), సూర్యప్రకాష్ (ఉషోదయ), సాయారెడ్డి (ఎస్వీ), జావెద్ (విజయసాయి) పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

బోధన్ గ్రామీణం : మావందిఖుర్దులోని మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం మాసశివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయంలో పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర అహ్మద్‌పూర్‌కర్ మహరాజ్ ప్రవచనాలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రాములు, నిర్వాహకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం : నాలుగో ఠాణా పరిధిలో సీసీఎస్ పోలీసులు జూద స్థావరంపై దాడి చేశారు. ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో జూదం ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి 11 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

జగన్మాత నమోస్తుతే



ఆర్యనగర్ లక్ష్మీవేంకటేశ్వరాలయంలో..



నగరంలో చిందు కళాకారులు..



నిజామాబాద్‌లోని మహాలక్ష్మీనగర్‌లో..

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి, సోమవారం దుర్గమ్మ శోభాయాత్ర వైభవంగా సాగింది. భక్తులు మంగళహారతులు సమర్పించారు. పారాయణాలు చేశారు. నిజామాబాద్‌లో వివిధ కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



జిల్లా కేంద్రంలో బోనాలతో మహిళలు.



ఒగ్గుడోలు కళాకారులు.



కోటగిరిలో..



గుస్సాడీ కళాకారుల నృత్యాలు



బోధన్ సరస్వతీనగర్‌లో..

అప్పుల భారంతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నవీపేట, న్యూస్‌టుడే : ఆర్థిక ఇబ్బందులతో ఓ ఆటో డ్రైవర్ గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఏఎస్సై మోహన్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. నవీపేట మండలం అనంతగిరికి చెందిన తూటుకూరు జీవన్‌రెడ్డి (57) కుటుంబ సభ్యులతో కలిసి పదేళ్లుగా నిజామాబాద్ నగరంలో నివాసముంటూ ఆటో నడిపిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత యంచ శివారులోని గోదావరి వంతెన వద్దకు అతను ఆటోలో వచ్చారు. అప్పుల భారంతో మనస్తాపం చెంది తాను గోదావరిలో దూకి చనిపోతున్నట్లు కూతురికి ఫోన్ చేసి చెప్పారు. తర్వాత చరవాణి స్విచ్ ఆఫ్ చేశారు. అనంతరం కొద్దిసేపటికే నదిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. అతని కూతురు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు అదే రోజు రాత్రి గోదావరి వంతెన చేరుకుని గాలించారు. ఆటో, చరవాణి కనిపించాయి కానీ జీవన్‌రెడ్డి జాడ తెలియరాలేదు. సోమవారం ఉదయం నది ఒడ్డున డ్రైవర్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. జీవన్‌రెడ్డి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.



జీవన్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నవీపేట, న్యూస్‌టుడే: జగ్గారావుఫారం శివారులో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందారు. ఏఎస్సై మోహన్ రెడ్డి, గ్రామస్థుల కథనం ప్రకారం.. రెంజల్ మండలం బాగేపల్లికి చెందిన నవీన్ (30)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కోస్లీ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్తు ఉపకేంద్రంలో సదరు యువకుడు వాచ్‌మెన్‌గా పనిచేసే వారు. రెంజల్‌కు చెందిన స్నేహితుడు విఘ్నేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం ఉదయం జిల్లాకేంద్రానికి వెళ్లారు. మిత్రుడిని నిజామాబాద్‌లో వదిలి నవీన్ తిరిగి సొంతూరుకు అదే రోజు సాయంత్రం బయల్దేరారు. జగ్గారావుఫారం వద్దకు రాగానే అతడి వాహనం అదుపు తప్పడంతో రోడ్డు విభాగినిని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన అతను కొద్దిసేపటి తర్వాత ఘటనాస్థలిలోనే చనిపోయారు. నవీన్ తండ్రి చిన్నతనంలో మృతి చెందగా తల్లి ఆరేళ్ల కిందట చనిపోయినట్లు గ్రామస్థులు చెప్పారు. మామ సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.



నవీన్

మృతదేహం లభ్యం

రెంజల్, న్యూస్‌టుడే: కందకుర్తి గోదావరి నదిలో శనివారం దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామానికి చెందిన లక్ష్మణ్ (26) మృతదేహాన్ని సోమవారం వెలికితీసినట్లు ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ ఆటో నడుపుతూ జీవించేవారు. ఆయన భార్య ఆరు నెలల కిందట మృతిచెందడం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెంది కందకుర్తి గోదావరి వంతెన వద్ద నదిలో దూకారు. లక్ష్మణ్ కొంతకాలం నుంచి సాటాపూర్‌లోని తన బావ ఇంట్లో ఉండేవారు. అతనికి ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి బావ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

క్రైమ్ కార్నర్

నాలుగు ఇసుక టిప్పర్ల పట్టివేత

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: మంజీర నది పరివాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా పరిమితికి మించి బోధన్ వైపునకు ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లను ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వాహనాలను తహసీల్ కార్యాలయానికి తరలించినట్లు తహసీల్దార్ విఠల్ తెలిపారు.

డీజే యజమానులపై కేసు నమోదు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రెండో ఠాణా పరిధిలో నిషేధిత డీజేలను వినియోగించినందుకు ముగ్గురిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిషేధిత డీజేలు ఉపయోగించొద్దని సీపీ ఉత్తర్వులు జారీచేసినా పట్టించుకోకుండా డీజేలు పెట్టి ఇబ్బంది కలిగించిన సంపత్, నవీన్, ఆదిత్యలపై కేసు నమోదు చేసి, డీజేలు సీజ్ చేశామని ఎస్‌హెచ్‌వో యాసిర్ అరాఫత్ తెలిపారు.

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా దుర్గామాత శోభాయాత్రలో డీజేలు పెట్టినందుకు వాటి యజమానులపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. లఖన్, మహేష్‌లకు చెందిన డీజేలను ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. యాత్ర కొనసాగుతున్న క్రమంలో ఓ ప్రార్థన మందిరం వద్ద కొందరు టపాసులు పేల్చేందుకు యత్నించిన ఓ వర్గం వారిని పోలీసులు నిలువరించారు. టపాసులు కాల్చకుండా ఆపడంతో కొద్దిసేపు పోలీసులు, నిర్వాహకులకు కొద్దిసేపు అక్కడ తోపులాట జరిగింది. స్వల్ప ఘటనలు మినహా దుర్గామాత శోభయాత్ర ప్రశాంతంగా ముగిసింది.

నియంత్రికల ధ్వంసం

పోతంగల్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి మూడు నియంత్రికలను ధ్వంసం చేసినట్లు పోతంగల్ విద్యుత్తు శాఖ ఏఈ నర్సారెడ్డి తెలిపారు. జల్లాపల్లిలో ఒకటి, లింగాపూర్‌లో రెండు నియంత్రికలను ధ్వంసం చేసి అందులో ఉన్న ఆయిల్, రాగి తీగలు దొంగిలించారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

16న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం

ఖలీల్‌వాడి : ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం శ్రావ్య గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి తెలిపారు. సోమవారం నగరంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. వర్గీకరణపై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించేందుకు చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో బాలు, గంగారాం, సురేష్, గంగాధర్, మారుతి పాల్గొన్నారు.

బోధన్ : నిజామాబాద్‌లో 16న నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య కోరారు. బోధన్‌లో సోమవారం పాత్రికేయులతో మాట్లాడారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు తర్వాత తొలిసారి జిల్లాకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ వస్తున్నారని తెలిపారు. పోశెట్టి, చంద్రయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం



మౌనం పాటిస్తున్న న్యాయవాదులు

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే : బోధన్ సీనియర్ న్యాయవాది, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మాజీ సభ్యుడు సత్యనారాయణమూర్తి మృతికి నిజామాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది సంఘమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

బోధన్, న్యూస్‌టుడే : శక్కర్‌నగర్ కాలనీకి చెందిన చక్కెర పరిశ్రమలో రోజువారీ వేతన కార్మికుడిగా పనిచేసిన కేశవ్ (45) గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. పరిశ్రమ మూతపడటంతోనే తీవ్ర ఇబ్బందులపాలై మనోవేదనతో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు కుమారస్వామి డిమాండు చేశారు. చాలా మంది కార్మికులది దయనీయ పరిస్థితేనని, ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుని పరిశ్రమ తెరిపించడం, కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు ఇప్పించడంపై దృష్టి సారించాలని డిమాండు చేశారు.



కేశవ్

ఆర్మూర్
● ఆర్మూర్ ● బాల్కొండ

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



మాక్లూర్, న్యూస్‌టుడే: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ అజార్‌కిషన్‌రావు సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాక్లూర్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు గోపాల్‌నగేష్, సీనియర్ నాయకులు జీబీ గోవర్ధన్, నయీం తదితరులు పాల్గొన్నారు.

లింగమయ్య స్వామికి పూజలు

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ శివారులోని లింగమయ్య స్వామి ఆలయంలో వార్షిక మాసోత్సవాలను సోమవారం నిర్వహించారు. స్వామికి అభిషేకం, అన్నపూజ చేశారు. గనుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ పూజలు చేశారు. మాజీ సర్పంచి తౌటు గంగాధర్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

16న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం

ఖలీల్‌వాడి : ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం శ్రావ్య గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి తెలిపారు. సోమవారం నగరంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
94939 26837
98666 11160

నందిపేట్, న్యూస్‌టుడే: నికాల్‌పూర్ గ్రామంలో మురుగు నీరు మా పొలాల్లోకి వస్తోంది. పంటలు నాశనమవుతున్నాయి. సీజన్‌లో అర ఎకరం పసుపు పంట దెబ్బతిన్నది. **-జీవన్, నికాల్‌పూర్**

సమాధానం: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. మురుగు నీరు పొలాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.
-విఠలాచారి, పంచాయతీ కార్యదర్శి

మాక్లూర్ గ్రామీణం: మాక్లూర్ మండలం అమ్రాద్‌తండాలో కరెంట్ స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. **- చందర్‌నాయక్**

సమాధానం: వెంటనే వీధిదీపాలను ఏర్పాటు చేస్తాం. సమస్య లేకుండా చూస్తాం.
- ఎంపీవో శ్రీనివాస్

మాక్లూర్ గ్రామీణం: గుత్పలో శునకాలు గుంపులుగా తిరుగుతున్నాయి. **- సురేష్**

సమాధానం: ఇప్పటికే కొన్ని శునకాలకు మందులు ఇచ్చాం. మరికొన్నింటికి త్వరలోనే మందులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.
- ఎంపీవో శ్రీనివాస్

ఆర్మూర్ పట్టణం: మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద కాలువలో పూడిక పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. **- సంతోష్**


సమాధానం: సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. **- రాజు, బల్దియా కమిషనర్**

మురుగు కాలువలు శుభ్రం



మాక్లూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్ప గ్రామంలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. దోమలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీవో శ్రీనివాస్ పంచాయతీ సిబ్బందితో మురుగు కాలువలు శుభ్రం చేయించారు.

పట్టభద్రులూ.. కదలండి!



న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి

నిజామాబాద్- ఆదిలాబాద్- మెదక్- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబరు 30న మొదలు పెట్టింది. నవంబరు 6 వరకు కొనసాగుతుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఫారం-18తో ఆన్‌లైన్ ద్వారా లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఫొటో, డిగ్రీ ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేయాలి. పరిశీలనకు నివాసానికి వస్తే డిగ్రీ ధ్రువీకరణ పత్రం ఒరిజినల్ చూపించాలి. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుకు డిగ్రీ ధ్రువీకరణ పత్రం జతచేసి బీఎల్‌వో లేదా తహసీల్దార్ కార్యాలయంలో నేరుగా అందజేయవచ్చు. 31 అక్టోబరు 2021 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఓటరు నమోదుకు అర్హులవుతారు. 1 నవంబరు 2024 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై మూడు ఏళ్లు పూర్తి కావాలి.

● ఓటరుగా నమోదు చేసుకోండి

● నవంబరు 6 వరకు అవకాశం

దరఖాస్తుకు జతచేయాల్సినవి
- పాసుపోర్టు సైజు ఫొటో
- డిగ్రీ ధ్రువీకరణ పత్రం
- ఓటరు ఐడీ
- ఆధార్‌కార్డు

మండలాల వారీగా పట్టభద్రులు

మండలం	పట్టభద్రులు
నందిపేట్	982
కమ్మర్‌పల్లి	492
ఏర్గట్ల	155
మాక్లూర్	645
మోర్తాడ్	485
బాల్కొండ	475
వేల్పూర్	642
ముప్కాల్	358
మెండోరా	241
భీమ్‌గల్	589
ఆర్మూర్	2861

ఆన్‌లైన్‌లో చేశా



గత పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేశాను. మళ్లీ ఓటరుగా నమోదుకు షెడ్యూల్ విడుదల కావడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశా. ఓటరుగా నమోదు చేసుకున్నాను. నవంబరు 6 వరకు అవకాశం ఉంది. పట్టభద్రులంతా సద్వినియోగం చేసుకోవాలి. ఎన్నికల్లో ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలి. **ఉట్నూర్ రాజశేఖర్, కమ్మర్‌పల్లి**

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

పట్టభద్రులంతా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టభద్రులైతే ఫారం-18, ఉపాధ్యాయులైతే ఫారం -19 ద్వారా దరఖాస్తు చేయాలి. నవంబరు 6 వరకు గడువు ఉంది.
ఆంజనేయులు
తహసీల్దార్ కమ్మర్‌పల్లి

ఏసీపీ కార్యాలయం ఎదుట ధర్నా



ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల్లో భాగంగా పూజలందుకొన్న అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని భాజపా, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు ఆరోపించారు. నిబంధనలు పాటించలేదని పలు డీజేలు, అత్యధికంగా లైటింగ్ ఏర్పాటు చేసిన వాటిని పోలీసులు ఠాణాకు తరలించారు. ఇందులో కొన్ని నిబంధనలకు లోబడి ఏర్పాటు చేసినా తరలించారని యూత్ సభ్యులు ఆరోపించారు. సోమవారం నిమజ్జనానికి తీసుకెళ్లాల్సిన దుర్గాదేవి విగ్రహంతో ఏసీపీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సౌండ్ సిస్టం ప్రారంభించకముందే ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. తాము పోలీసు శాఖకు సహకరిస్తున్నామని, వారు మాత్రం కొందరికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఎస్సైలు రాము, గంగాధర్, చేరుకొని సర్దిచెప్పేందుకు యత్నించారు. సౌండ్ సిస్టం అప్పగిస్తేనే వెళ్తామని డిమాండ్ చేయడంతో వారికి ఇచ్చారు. భాజపా జిల్లా అధికార ప్రతినిధి గంగాధర్, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు ఉదయ్, బాలు ఉన్నారు.

ప్రజావాణికి 51 అర్జీలు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, ఇన్‌ఛార్జి డీపీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ ప్రజల నుంచి 51 అర్జీలు స్వీకరించారు.



భీమ్‌గల్‌లో..



బడాభీమ్‌గల్‌లో..

వైభవంగా శోభాయాత్ర



ఆర్మూర్‌లో..



భీమ్‌గల్‌లో కళాకారులు

ఆర్మూర్ పట్టణం, భీమ్‌గల్, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలో దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర రెండో రోజు సోమవారం కొనసాగింది. పట్టణ వ్యాప్తంగా ప్రతిష్ఠించిన విగ్రహాలను గోల్‌బంగ్లా మీదుగా నిమజ్జనానికి తరలించారు. యువకులు నృత్యాలు చేసి సందడి చేశారు. భీమ్‌గల్ మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలతో శోభాయాత్రలు నిర్వహించారు. కళాకారులు నృత్యాలు చేశారు.



గోల్‌బంగ్లాలో...



భీమ్‌గల్‌లో నృత్యాలు చేస్తూ

సద్దుల బతుకమ్మ వేడుకలు



హాసాకొత్తూర్‌లో..



అంక్సాపూర్‌లో..



కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లి, కోనాపూర్, హాసాకొత్తూర్‌లో గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏటా దసరా తర్వాత జరుపుకొంటారు. మహిళలు బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆడారు. గ్రామాల్లో ప్రధాన వీధుల్లో శోభాయాత్రగా తీసుకెళ్లారు. స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. గ్రామ కమిటీ, పంచాయతీ ఆధ్వర్యంలో చెరువుల వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేశారు. చెరువు గట్టున భోజనాలు చేశారు.

అంక్సాపూర్(వేల్పూర్): అంక్సాపూర్‌లో సోమవారం పాశపు గురడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మ ఆడారు.

ఏర్గట్ల: వివిధ గ్రామాల్లో బతుకమ్మ సంబరాలను మహిళలు, యువతులు సోమవారం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలకు యువతులు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులోని చెరువులో వదిలారు.



కోనాపూర్‌లో..



ఏర్గట్ల మండల కేంద్రంలో...



కమ్మర్‌పల్లిలో బతుకమ్మలు పేర్చుతూ..

నాణ్యతాప్రమాణాలపై అవగాహన

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: వస్తు, సేవల నాణ్యతాప్రమాణాలపై ఈనెల 14 నుంచి నవంబర్ 16 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు అనిల్, ఉపాధ్యక్షుడు వర్మ తెలిపారు. వినియోగదారుల హక్కుల వివరాలు ఉన్న గోడప్రతులను ఆర్మూర్ డీటీ హరీష్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కార్యదర్శి ప్రవీణ్, శ్రీనివాస్, రత్నాకర్, రామనాథం, దేవేశ్ తదితరులు పాల్గొన్నారు.



గోడ ప్రతులు విడుదల చేస్తున్న డీటీ హరీష్ తదితరులు

కరపత్రాల ఆవిష్కరణ

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పూర్వ నాయకులు పోచన్న పిలుపునిచ్చారు. సోమవారం ఆర్మూర్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్, పూర్వ నాయకులు దాసు, సూర్య శివాజీ, సాయి రెడ్డి, అబ్దుల్, రవి, సూరిబాబు, సాయన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీకి దసరా ధమాకా!

☛ ఆర్మూర్ డిపోనకు మెండుగా ఆదాయం



బస్టాండులో కిక్కిరిసిన జనం

–న్యూస్‌టుడే, ఆర్మూర్

ఆర్మూర్ ఆర్టీసీ డిపోకు ఈ దసరా పండగ కాసుల వర్షం కురిపించింది. బస్సుల సంఖ్య తగ్గినా, మహాలక్ష్మి పథకం అమలులో ఉన్నా ఆశాజనకమైన వసూళ్లు రాబట్టింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఏకంగా రెట్టింపు ఫలితాలు సాధించింది. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) గతేడాది రూ. 59 ఉంటే ఈసారి రూ. 103కి చేరింది. అలాగే కిలోమీటరు చొప్పున లెక్కకట్టే ఖర్చు (ఎర్నింగ్ పర్ కిలోమీటర్- ఈపీకే) సైతం గతేడాది రూ. 37.10 ఉంటే ఇప్పుడు రూ. 67.66 రావడం విశేషం. ఇంకా పండగ సీజన్ కొనసాగుతుండటంతో ప్రగతిలో మరింత పురోగతి కనిపించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

దసరా పండగ నేపథ్యంలో ఈనెల 3వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రూ.19.65 లక్షల ఆదాయం వచ్చింది.

బస్సులు నిండుగా

ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలతో పాటు జిల్లా కేంద్రం నిజామాబాద్, రాజధాని హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, నిర్మల్ జిల్లాల మార్గాల్లో ఆర్మూర్ డిపో బస్సులను నడుపుతోంది. ఇప్పుడు ఏ బస్సు చూసినా చాలు ప్రయాణికులతో నిండుగా కనిపిస్తోంది. ఉదయం, రాత్రి వేళ మాత్రం ఖాళీ సీట్లు దర్శనమిస్తాయి. ఇక మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. పల్లెల నుంచి పట్టణాలకు దసరా షాపింగ్‌కు గుంపులుగా వెళ్లడం, అలాగే నగరాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధి కోసం తాత్కాలికంగా స్థిరపడిన వారు సొంతూళ్లకు వచ్చిపోతున్నారు. బస్టాండ్లలో రద్దీ కనిపిస్తోంది.

	నిరుడు	ఈ ఏడాది
నడిచిన బస్సులు	119	82
తిరిగిన కిలోమీటరు	41,315	29,050
ఆదాయం(రూ)	15,32,801	19,65,435

మరో పక్షం రోజుల్లో మరింత

ఈ ఏడాది పండగ సీజన్ ఆర్టీసీకి ఆశాజనకమైన రాబడి ఉంది. ప్రయాణికుల రద్దీ పెరిగింది. అవసరాలను బట్టి ప్రణాళికతో బస్సులు నడిపాం. పండగకు వచ్చిన వారు తిరుగుముఖం పట్టేందుకు ఇంకా సమయం ఉంది. మరో పక్షం రోజుల పాటు ప్రభావం ఉంటుందని భావిస్తున్నాం. అప్పటివరకు మరింత ఆదాయం వచ్చే వీలుంది. **రవికుమార్, ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్**

డంపింగ్ యార్డు పరిశీలన

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: నాగారం శివారులోని డంపింగ్‌యార్డును నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు సోమవారం పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేసి కంపోస్టు తయారు చేయడంపై ఆరా తీశారు. త్వరలో సీడీఎంఏ అధికారులు పర్యటించనున్న నేపథ్యంలో కమిషనర్ ముందస్తుగా తనిఖీ చేపట్టారు.

నేడు వైద్య శిబిరం

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్‌లోని హనుమాన్‌గల్లి, రాజ్‌నగర్ దుబ్బాలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నందిపేట్ పీహెచ్‌సీ వైద్యుడు ప్రవీణ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఇందులో సాధారణ, సీజనల్ వ్యాధులకు చికిత్సలు చేస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: గురుకుల 1:2 అభ్యర్థుల సమస్యను పరిష్కరించాలని ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి అభ్యర్థులు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, సమస్యను పరిష్కరించి, న్యాయం చేయాలని ఆయన సూచించారని అభ్యర్థులు తెలిపారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కమ్మర్‌పల్లి,న్యూస్‌టుడే: బషీరాబాద్‌లోని ఐటీఐ కళాశాలలో ఈ ఏడాది కొత్తగా అడ్వాన్స్ కోర్సులు ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ కోటిరెడ్డి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్త కోర్సుల వివరాల కోసం 94915 66890 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

కథల పోటీల్లో ప్రతిభ

ఏర్గట్ల: మాచిరాజు బాల సాహిత్య కళాపీఠం గత నెలలో జాతీయ స్థాయిలో కథల పోటీలు నిర్వహించింది. తెలుగు రాష్ట్రాల నుంచి 250 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 20 ఉత్తమ కథలను ఎంపిక చేశారు. ఇందులో ఏర్గట్ల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అభిలాష్ రాసిన 'మంచి మనసు' అనే కథ ఎంపికైనట్లు పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ప్రవీణ్ శర్మ తెలిపారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను వచ్చే నెల 3న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఠాణాలో ఫిర్యాదు

బాల్కొండ, న్యూస్‌టుడే: బస్సాపూర్‌లో ఆదివారం బతుకమ్మ ఆడుతున్న ఓ కులానికి చెందిన మహిళలను మరో కులానికి చెందిన వారు దూషించారని బాల్కొండ పోలీస్ స్టేషన్‌కు సోమవారం తరలి వచ్చి ఫిర్యాదు చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈర్నాల వినోద్‌కుమార్, రాష్ట్ర సంఘ ప్రతినిధి గంధం రాజేష్, ఎస్సీ ఉప కులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీరగొండ బుచ్చన్న, మాజీ సర్పంచి లింగస్వామి పాల్గొన్నారు. ఇదే విషయంలో బస్సాపూర్‌కు చెందిన కుల సభ్యులు బాల్కొండకు తరలి వచ్చారు.

చాయ్ తాగేందుకు వెళ్లి మృతి

ఆర్మూర్ పట్టణం: చాయ్ తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పెర్కిట్ చౌరస్తాలో సుద్దపల్లి చిన్నగంగాధర్(55) ప్రతి రోజు టీ తాగడం అలవాటు. సోమవారం ఉదయం 4 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న ఓ కారు అతివేగంగా ఢీకొంది. గంగాధర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కత్తిపోటు కలకలం

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి కత్తిపోటు కలకలం సృష్టించింది. స్థానికుల కథనం ప్రకారం.. దుర్గామాత శోభాయాత్రలో భాగంగా వరుణ్ అనే యువకుడు ఓ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె తనకు కాబోయే భర్తకు సమాచారం ఇచ్చింది. అతను వచ్చి వరుణ్‌పై కత్తితో దాడి చేశాడు. స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. యువకుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రహదారి.. పొదలతో మూసుకుపోయి..

ఆర్మూర్ రైల్వేస్టేషన్‌కు సరైన రోడ్డు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్మూర్, పెర్కిట్ ఆర్టీసీ బస్టాండ్‌కు 2.5 కి.మీలు, మామిడిపల్లి చౌరస్తా నుంచి 1.5 కి.మీల దూరంలో పట్టణ శివారులో ఉంది. ప్రధాన రహదారి నుంచి స్టేషన్‌కు వెళ్లాలంటే రోడ్డు మార్గం సరిగా లేదు. రైల్వేశాఖ పరిధిలోని స్థలంలో కొద్ది వరకు సీసీ రోడ్డు నిర్మించారు. ఆ మార్గంలో చెట్లు దట్టంగా పెరిగాయి. కొమ్మలు పూర్తిగా రోడ్డుపైకి చేరడంతో ఏ వైపు వెళ్లాలో, ఏ పొదల నుంచి ఏ విషపురుగులు వస్తాయో తెలియక ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం

'భాజపాతోనే సుస్థిర పాలన'

నందిపేట్, న్యూస్‌టుడే: దేశ ప్రజలకు భాజపాతోనే సుస్థిర పాలన అందుతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు కోటపాటి నర్సింహంనాయుడు అన్నారు. డొంకేశ్వర్‌లో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మోదీ పాలనకు మద్దతు పలకాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పోతుగంటి సురేందర్, నాయకులు రుక్మాజి, సాగర్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాళ్లరాంపూర్(ఏర్గట్ల), న్యూస్‌టుడే: తాళ్లరాంపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మార్క్‌ఫెడ్ అధ్యక్షుడు మార గంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సోయాలను తీసుకొచ్చి రూ.4,892 మద్దతు ధర పొందాలని సొసైటీ అధ్యక్షుడు పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏఎంసీ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య, ఉపాధ్యక్షుడు బుచ్చయ్య, ఏఎంసీ డైరెక్టర్ లింగారెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం రంజిత్‌రెడ్డి, ఏఈవో సాయిసచిన్, సంఘం పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి గణేశ్, రైతులు పాల్గొన్నారు.

